కుంపటిలో కుసుమం

శ్రీ మధురాంతకం రాజారాం

"ఏమిటోయ్ అహమద్! ఈ వేళ ఎంతకూ బండి స్పీడ్ అందుకోవడంలేదే! అవతల నాకు బోలెడన్ని పనులున్నాయి" అన్నాడు వెనకసీటుకు చేరగిలబడి సిగరెట్టు కాల్చుకుంటున్న వజ్రపాణి

"ఎక్కడో మిషన్ కొంచెం చెడిపోయినట్టుందండీ! ఐనా యింకెంతదూరం దరిదాపుకువచ్చేశాం" అన్నాడు డ్రయివరు.

వజ్రపాణి తల కొంచెం పైకెత్తి తలుపుకడ్డంగా వున్న గ్లాసులోనుంచి పరిసరాల్ని పరికించాడు. కారు చెరువుకట్టమీద పరుగిడుతోంది. బాలభానుడి స్వర్ణ కాంతుల్లో ఆవైపున కొండకోనలు, ఈవైపున పైరుపచ్చలు మధ్య నిండిన చెరువు మెరసిపోతూ శోభాయమానంగా కన్పిస్తున్నాయి చెరువులో అక్కడక్కడా అల్లి తామరపువ్వులు విరిసి నవ్వుతున్నాయి. తన మనసులాగే ప్రకృతి సైతం ఆనందంలో తుళ్ళిపడుతున్నందుకు వజ్రపాణికి కలిగినతృప్తి, అతడిచేత సన్నగా ఒక ఈలపాట పాడించింది.

పాట పాడుకుంటూనే వజ్రపాణి ఆలోచనలో పడ్డాడు. ప్రసన్న పుట్టినరోజు పండుగకి వాతావరణం చాలా బాగా అమరింది. ఈపాటికి వంటలుకూడా ప్రారంభమై వుంటాయి. ఇక తను వెళ్ళడమూ, తోటలో కుర్చీలు అవీ వేయించడమే తరువాయి. మధ్యాహ్నం దాటిందంటే అతిథులొక్కొక్కరే దిగబడతారు. వాళ్లకు స్వాగత సత్కారాలతోనే తనకు సరిపోతుంది. ఆలోపలే అన్ని ఏర్పాట్లు జరిగిపోవాలి.

ప్రసన్న తల్లో కొన్ని విచిత్రపుటూహలు వుప్పతిల్లడం, వజ్రపాణి కొంచమో గొప్పో వాటి ప్రభావానికి లోనుకావడం అప్పుడప్పుడూ జరిగే విషయమే. వివాహానికి వెనుకటిసంగతి తనకు తెలియదుగాని ఆ తరువాతమాత్రం తను తన చేతిమీదుగా నాలుగుసార్లు ప్రసన్న పుట్టినరోజు పండుగ చేశాడు. అవన్నీ పట్టణంలో, తన స్వంతభవనంలో వందలాది అతిథులమధ్య, నాట్యగానాది వినోదవిలాసాలమధ్య ఎంతో వైభవోపేతంగా జరిగాయి. ఈసారికూడా అలా జరుగవలసిందే! కానీ ప్రసన్నమూలంగా తన నిర్ణయం తల్లక్రిందులైపోయింది.

పుట్టినరోజు కింక పదిరోజు లుండగా, ఒక నాటిరాత్రి ప్రసన్న పున్నమనాటి రేరాజును చూచి పొంగిపోతున్న కడలి కెరటాలను చూస్తూ కూచున్న మనిషి అలా చూస్తూ కూచోక వున్నట్టుండి తల పైకెత్తి "ఈసారి నా పుట్టినరోజు పండుగ మనవూళ్లో జరుపుకుందామండీ" అంది.

"ఆ పల్లెటూళ్ళోనా! అక్కడేం దొరుకుతుంది ప్రసన్నా!" అన్నాడు తను.

"కావలసినవన్నీ యిక్కడనుంచే తీసుకపోదాం లెండి" అంది ప్రసన్న.

"తీసుకపోవచ్చనుకో. కాని అక్కడి కెవరొస్తారు? నువ్వూ, నేనూ, వంటమనిషి, పెట్రోమాక్సులైటు మోయడానికి నారిగాడుతప్ప అక్కడెవరూ వుండరు."

"అదే మరి! ఇక్కడైతే ఇంతకుముందు మనమెప్పుడో వాళ్ళకి ఋణపడినట్టు రిక్షాల్లో, టాక్సీల్లో వచ్చి అసంఖ్యాకంగా వాలిపోతారు. వీళ్ళల్లో ఎందరికి మనపట్ల నిజమైన అంతఃకరణవుందో తెలుసుకోవాలి. పోనీ, యిదొక పరీక్షనుకోండి. రాదలచుకుంటే డెబ్బయిమైళ్ళు ఏమంత దూరప్రయాణం కాదు."

ప్రసన్న వాదం విన్నమీదట తనందుకు అంగీకరించక తప్పలేదు.

ఘుమ్మని సంపెంగపూల వాసన తనదాకా రావడంతో వజ్రపాణి లేచి కూచున్నాడు. కారు తన మామిడితోటకి ప్రక్కన వెళ్తోంది. పట్టణంలో తన కోసం సర్వదా కాచుకునివుండే వెయ్యి వ్యవహారాల బాదరబందీనుంచీ ఎలాగో బయటబడి స్వగ్రామానికి తిరిగి వచ్చినప్పుడల్లా ముమ్మరంగా మామిడితోటలోనుంచీ సంపెంగపూల మధుర సుగంధం ఎదురైవచ్చి తనకు స్వాగతవచనం పలుకుతుంది. ఆ తోట, తోటలోపల దిగుడు బావి, బావి చుట్టూ నందివర్ధనం చెట్లు,

వాటిచెంత పండ్లు విరుగగాచే జామచెట్లు, అవన్నీ తన చిన్ననాటి నేస్తాలు. అక్కడ కూచుంటే ఎంతటి చిరాకైనా యిట్టే మాయమైపోతుంది. కానీ ఈ ప్రశాంత వాతావరణంలో తనెంతోకాలం మెలగలేడు. రెండుమూడు రోజుల్లోనే ఈ స్తబ్ధ వాతావరణం తనకు వెగటైపోతుంది. ఉత్సాహంతో పురకలు వేసుకుంటూ ఒక క్షణమైనా ఆగిపోకుండా ముందుకు సాగే జీవితం కావాలి తనకు! అదిక్కడ లభించదు.

కారు ఊరి పొలిమేరదాటి పెద్ద వీధిని సమీపిస్తోంది. ఆ వూరికి రాజవీధయినా, బజారు వీధయినా అదే! వజ్రపాణి కొంచెం ముందుకు జరిగి కూచుని ఊరివైపు చూడసాగేడు. తన బంగళా ఊరికవతల పూలతోటలో వుంది. పట్టణంనుంచీ రాకపోకల సందర్భంలో తప్ప మరోకప్పుడు తను ఊళ్ళోకి రావలసిన అవసరం వుండదు. ఒకవేళ తప్పి దారీ వచ్చినా ఊళ్ళో ఆ బాలగోపాలమూ తనని వింతజంతువులా చూస్తుంది. అదలా వుండగా, కాలినడకతో ఆ పల్లెటూళ్ళో తిరగడం తనకి నామోషీగా కనిపించే మాట కూడా నిజం!

కారు పెద్దవీధిగుండా పరుగెడుతోంది. వజ్రపాణి టిన్ను తెరచి మరో సిగరెట్టు పైకి తీశాడు. పెట్టెపైన అగ్గిపుల్ల చరాలున గీచి ముట్టించుకోడానికి పైకెత్తాడు. కానీ వున్నట్టుండి పడిన బ్రేకుతో కారు హఠాత్తుగా వీధిమధ్య ఆగిపోవడంతో, ఆ అగ్గిపుల్ల మధ్యలోనే ఆరిపోయింది.

"ఇక్కడేదో దొమ్మీ జరుగుతోందండీ" అన్నాడు డ్రయివరు.

"వాటికేం తక్కువ! బ్రతకడ మెలాగో తెలియకపోయినా కక్షలుగా చీలి చావబాదుకుని కోర్టుల వెంబడి తిరగడం వీళ్ళకి బాగా అలవాటయింది. నువ్వు త్రోవచేసుకుని కారు స్టార్ట్ చెయ్" అన్నాడు వజ్రపాణి.

కానీ త్రోవచేసుకోడానికి అహమద్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. వీధిలో పిన్నా పెద్దా, పిల్లా జల్లా రెండుమూడు వందలమంది పోగయ్యారు. ఆ గుంపులో ఎక్కడ ఎవరు ఎవరిపైన చేయి జేసుకుంటున్నారో అహమద్ గుర్తించలేకపోయాడు. "త్రోవ, త్రోవ" అంటూ అతడు తన శక్తికొద్దీ అరవనైతే అరవగలిగాడు గానీ, ఎంతటి అరపైనా మంచి రసపట్టులోవున్న దొమ్మీముందు లవలేశమైనా పని చేయదని అతడూహించుకోలేక పోయాడు.

ఇంతలో కారు చుట్టూ కూడా జనం ప్రోగయ్యారు. కుర్రకారుకు వజ్రపాణి కారు పుష్పక విమానంలా కనిపించివుండాలి మరి వాళ్ళు దాని కానుకుని లోపల ఎంత ఎంతటి వింతలున్నాయోనని తొంగి చూడసాగారు. పోట్లాడుకుంటున్న వారి మధ్య రాజీ కుదర్చడానికి ప్రయత్నిస్తున్న పెద్దల్లో సైతం ఒకరిద్దరు ముందుకు పరుగెత్తివచ్చి" సరిగ్గా సమయానికి వచ్చారు బాబూ! మీకు వెయ్యేళ్ళాయుష్షు. మరేమనుకోకుండా యిక్కడోసారి దిగాలి మీరు" అంటూ చేతులు జోడించారు.

"గొప్ప ఘనకార్యమే చేస్తున్నారు. ఇక్కడ ఆగి వ్యవహారాన్ని ఫయిసలా చేస్తూ కూచోడానికి నాకు తీరికలేదు" అన్నాడు వజ్రపాణి.

ఇరుపక్షాలకూ రాజీ కుదర్చడంలో తలమునకలైన సైతం ఎక్కడో దారబోసుకున్న వృద్ధుడొకడు మరీ ముందుకు వచ్చి "బాబ్బాబూ! మీరే అలాగంటే మేమేం చెప్పాలి? మా కష్టనష్టాలు మేమెవరితో చెప్పుకోగలం బాబూ! పెద్ద బాబుగారి హయాంలో గ్రామంలో కిసుక్కని శబ్దం పైకి రేగేదికాదు. ఆ మారాజు చనిపోయి స్వర్గలోకంలో వున్నారు. ఈ గడుగ్గాయి కుర్రాళ్ళు బొత్తిగా మామాట వినిపించుకోడం లేదు. ఏం చెయ్యమంటారు" అన్నాడు.

వృద్ధుడు వినయంగా మనవి చేసుకున్నట్టే కనపడ్డాడు. కానీ ఆ మనవి వజ్రపాణిలో అభిమానాన్ని రెచ్చగొట్టింది. అందుకు ఫలితంగా అతడు చరచరా కారుదిగి "ఏయ్, ఏమిటా గోల!" అంటూ ముందుకు నడిచాడు.

క్షణంలో గగ్గోలు ఉపశమించింది. ఎక్కడివారక్కడే మౌనంగా నిలబడ్డారు. ఛాతీపైన సేలం జరీ కండువ రెపరెపలాడుతుండగా వజ్రపాణి జనసమూహం మధ్యకి నడిచి "అసలు సంగతి చెప్పండి" అన్నాడు.

అసలు సంగతి మరొకరు చెప్పకపోతే వజ్రపాణి ఊహకు తెగలనంత క్లిష్ట విషయమేమీ కాదు. ఇంతకూ అక్కడ జరిగింది కారు డ్రయివరు ఉహించినట్టు దొమ్మీకాదు. దాన్ని దొమ్మీ అనడమే అనుచితం. ఇరుపక్షాలా కొంత బలగంచేరి కర్రలతో కటారులతో ఒకరితో ఒకరు తలపడ్డం దొమ్మీ అని వ్యవహరింపబడుతుంది. ఇది అలాటిదికాదు. ఇక్కడా ఏడెనిమిదిమంది దృఢకాయులు బాణా కర్రలు, బడితెల్లాంటి శస్త్ర సంపత్తితో రంగాన మోహరించి వున్నమాట నిజమే! కానీ రెండో పక్షాన వున్నది

మాత్రం ఒక్కడంటే ఒక్కడు! అతడు నేలపైన బోరగిలబడి లేవడానికి వృథా ప్రయత్నాలు చేస్తున్నాడు. జగడంలో దెబ్బల తాకిడికి చినిగి పీలికలు వాలికలై పోయిన అతడి దుస్తులపైన నెత్తురు మరకలు నీరెండలో నిగనిగలాడుతున్నాయి. కాలిపైన తగిలిన బలమైన గాయంనుంచి యింకా రక్తం ప్రవహిస్తోంది.

కారొకటి వచ్చి వీధిలో ఆగిందనీ, అందులో నుంచి వజ్రపాణి దిగాడనీ తెలియగానే పద్మవ్యూహం పన్ని ఒంటెరిపాటున తమ చేతిలోపడ్డ ఎదుటివాడి పనిపట్టడానికి కృతనిశ్చయులైన ఆయుధపాణు లందరూ రెండడుగులు వెనక్కి వేశారు. ఒకరిద్దరు వజ్రపాణి దృష్టికి అందకుండా పారిపోజూచారు. కాని వాళ్ళకా అవకాశం దొరక్కముందే వజ్రపాణి రంగంపైకి వచ్చి నిలబడ్డాడు.

"ఎవడు వీడు, ఎందుకిలా చావ బాదేశారు?" అని మళ్ళీ ప్రశ్నించాడు వజ్రపాణి.

"తెలియలేదా అన్నయ్యా! నేనే రంగణ్ణి!" అంటూ బాణాకర్రలకు, బడితెలకు శరీరాన్ని అప్పగించి చిత్తు చిత్తయిన వ్యక్తి తన ముఖాన్ని వజ్రపాణి వైపు త్రిప్పాడు.

కాలిక్రింద పడబోయిన కొదమ త్రాచును చూచి బెంబేలుపడి పారిపోయే పాంథుడిలా రంగడి ముఖం కనబడగానే వజ్రపాణి త్రుళ్ళిపడ్డాడు. వీడు రంగడు. తృణీకారమనే ఏకైకాయుధంతో లోకాన్ని నిర్భీతిగా ఎదిరిస్తున్న రంగడు వీడు!

రంగడిపైన వజ్రపాణికి ఏనాడూ సదభిప్రాయం లేదు. బ్రతకడం చేతకానివాళ్ళు, సుఖించడానికి పనలేని వాళ్లు ప్రపంచంపైన తిరగబడ్డం తప్ప మరేమీ చేయలేరని వజ్రపాణి నమ్మకం. అలాటి వాళ్ళలో రంగడు ఒక్కడు మాత్రమే కాదు, అగ్రగణ్యుడని కూడా వజ్రపాణి విశ్వసిస్తాడు.

రంగడిముఖం కనపడిన తర్వాత వీధిలో ఎంతో సేపు నిలబడడానికి వజ్రపాణికి మనస్కరించలేదు. ఈ రంగడెలాటివాడో తన కాదినుంచి తెలుసు. ముంజేతి కంకణానికి అద్దం అవసరంలేదు. ఎంతటి దురాగతం చేసి వుండకపోతే ఒక్కసారిగా వీడు యిందరికి కానివాడౌతాడు! అదీగాక వీధిలో నిలబడి నిల్చున్నపాటున పరిష్కరించడానికి వీలున్న వ్యవహారం కాదిది. పల్లెటూరి రచ్చలకు, రగడలకు బీరకాయ పీచులాంటి మూల కారణాలుంటాయి. వాటిని వింటూ కూచోడానికి యిది సమయంకాదు.

వజ్రపాణి బిరబిరా కారు దగ్గరికివెళ్ళి "రాచ కార్యం వెలగబెట్టింది చాలుగానీ ఇక అందరూ యిళ్ళకు వెళ్ళండి. మళ్ళీ ఏదైనా గొడవ జరిగిందని విన్నానంటే పోలీసులకి కబురు పంపిస్తాను. కమ్ముల్లోపల కొంతకాలంవుండి వస్తేగానీ మీ తిక్క కుదరదు" అంటూ లోపల కూచుని "పోనీవోయ్ అహమద్" అన్నాడు.

లాంఛన ప్రాయంగా ఒకసారి హెచ్చరించి, అంతటితో వజ్రపాణి చల్లగా జారుకుంటాడని అక్కడున్న వాళ్ళెవరూ అనుకోలేదు. అతనలా వెళ్ళిపోవడం చాలమందికి ప్రమోదం కలిగించింది. రంగడు వజ్రపాణికి చిన్నాన్నకొడుకే కావచ్చు. కాని అతడి దృక్పథంలో రంగడు దురాత్ముడు. అవినీతిపరుడు. కాబట్టే అతడు ముభావంగా వూరుకోలేక మాటవరస కొకసారి మందలించి తనదారి వెంబడి తాను వెళ్ళిపోయాడు.

తోటలో విందు పూర్తయ్యేసరికి రాత్రి పది గంటలయింది. అంచనాకంటే ఎక్కువమందే వచ్చారు అతిథులు! రాకేంచేస్తారు! వజ్రపాణి వ్యాపారం అలాటిది. అతడి పెట్టుబడిపైన ఆధారపడి ఒకటి రెండు ఫిలింకంపెనీలు పనిచేస్తున్నాయి. పెద్ద ఎత్తున ఒక సినిమా పత్రిక నడపడానికికూడా అతడి ఆధ్వర్యాన ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇట్టి పరిస్థితిలో వజ్రపాణి ఆశ్రితుల సంఖ్య అతని అంచనాని అతిక్రమించడం అంత ఆశ్చర్యపడవలసిన విషయంకాదు. ఒకరిద్దరు రచయితలు అచ్చొత్తించిన పద్యోపాయనాలతో సహా విచ్చేశారు. సాటి నిర్మాతలు, దర్శకులు, ఇంకా మిత్రులు, బంధువులు వచ్చారు. అందరికీ తెలుసూనికంగా ఒక్కసారి కథానాయకుడికి కంఠం అరువిచ్చి ఒక ప్రణయగీతంతో ప్రేక్షక ప్రపంచానికి తన్మయత్వం కలిగించడానికి ఉవ్విళ్ళూరుతున్న గాయకుడొకడు వచ్చాడు. "తమ గానసుధ మధురాతి మధురం! దాన్నింతకంటే సేవించి అరిగించుకోగల శక్తి మాకులేదు." అని అతిథులు విన్నవించుకునేంత వరకూ అతడు తనివితీరా పాడి శ్రోతల్ని రంజింపచేశాడు.

అతిథు లందరూ మేడపైన పడుకున్నారు. అశ్వమేధయాగం సాకల్యంగా నిర్వహించినంత తృప్తితో వజ్రపాణి మేడ ముంగిట ఆరుబయట ఈజీచైర్లో కూచున్నాడు. వెన్నెల పాలార కాస్తోంది. ఏ క్షణాన్నయినా పిలుపందుకోడానికి సిద్ధంగా నారిగాడు దగ్గర్లోనే నిల్చుకుని అయ్యగారి ముఖంకేసి చూస్తున్నాడు.

ఐదునిమిషాలు ఆలోచనతో గడపివేసిన తర్వాత వజ్రపాణి "ఒరే నారిగా! ఇలా దగ్గరికివచ్చి కూచో" అన్నాడు.

నారిగాడు దగ్గరికి వచ్చాడు. అయ్యగారికి తన ఆంతరంగిక కార్యదర్శిత్వం అవసరమైందన్న సంతోషం వాడి ముఖాన చిందులు త్రొక్కుతోంది.

"రంగడి నొకసారి రమ్మని చెప్పావుకదూ?"

"ఇంటికి వెళ్ళానండీ! గాయాలకు కట్లు కట్టుకోడానికని అతడు రామాపురం వెళ్ళాట్ట!"

"ఎవరు చెప్పారు?"

"అతడూ, ఆవిడా తప్ప యింకెవరున్నారండీ ఆ యింట్లో? ఆవిడే చెప్పింది."

వజ్రపాణివులిక్కిపడి లేచినిటూరుగాకూచుంటూ "ఏమిట్రా నారిగా! ఈమధ్య వీడేమైనా కథ నడిపించాడేమిటి! ఆవిడా, గీవిడా అంటున్నావు" అన్నాడు.

ఆ ప్రాంతంలో అందరికీ సుపరిచితమైన రంగడి ప్రణయగాథ. ఇంతవరకూ అయ్యగారి చెవులదాకా వెళ్లనందుకు నారిగాడు విస్తుపోయాడు. ఎంతగా నాగరికత ముదిరిపోయినా యిప్పటికీ అక్కడక్కడా తోటరాముడిలాటి వ్యక్తి రాకుమారిలాటి జగదేక సుందరిని వలచీ వలపించుకోగల డనడానికి రంగడి ప్రణయగాథ చక్కని తార్కాణ. రంగడు వజ్రపాణి మామిడితోటకు కొద్దికాలంపాటు కాపుదారీ నిర్వహించాడుకూడా! వాడి హయాంలో, ఆ తోపు, వాడికీ, వాడి నేస్తాలకు క్రీడాస్థలంగా వుపకరించింది. రంగడు భాగ్యవంతుడుగా పుట్టలేదుగాని, వున్నంతలోమాత్రం వాడిది ఎముక లేనిచేయి! కంచెకావల నిలబడి 'బాబూ! ఒక మామిడికాయ యిలా పడేస్తారూ' అని అడగనివాళ్లది పాపంగాని, చిరాకు, కోపం. అహంభావం ఇలాటి వేవీ లేకుండా కాయల్ని తీసి ఆవలికి గిరవాటు వేయడానికి రంగడు సర్వదా సంసిద్ధుడు! అందువల్ల వాడి నిరవాకంలో మామిడితోపుకు కీర్తిప్రతిష్ఠలు హెచ్చి, వజ్రపాణికి ఆదాయం సన్నగిల్ల సాగింది.

తోట కాపరితనం కాస్తా వూడిపోయిన తర్వాత రంగడు నూలులేని గాలిపటంలా కొంత కాలం దేశమంతా చెడతిరిగాడు. ఎలా తిరిగినా కవళ్ళం తిరిగి తిరిగీ నోటిదగ్గరికే రావలసినట్టు రంగడు మళ్లీ మళ్లీ స్వంతవూరికే తిరిగి రావలసివచ్చేది. జననీ, జన్మభూమి స్వర్గంకన్నా ఎక్కువన్నారు మరి! రంగడికి జనని లేదు, జనకుడూ లేడు. జన్మభూమిమాత్రం వుంది.

ఒకసారి రంగడు ఎంత దూరం వెళ్ళాడో, ఏం చేశాడో గానీ వెళ్ళిన మూడు నెలలకు తిరిగి వచ్చాడు. వస్తూ, వస్తూ వాడొక పిల్లనగ్రోవిని తీసుకొచ్చాడు. దానిపైన వాడు చేసిన సాధన చుట్టు ప్రక్కల వాళ్ళకందరికీ రిచ్చపాటు కలిగించింది. రాత్రిభోజనమైన తర్వాత భజనగుడి ముందు రచ్చపైన నందీశ్వరుడి కానుకుని కూచున్నాడంటే వాడి వేణుగానం మెల్లమెల్లగా అలలు అలలుగా సాగి పరిసర వాతావరణాన్ని మత్తుతో నింపివేసేది. ఊదుతూ, ఊదుతూ అలాగే నేలపై కొరిగి పిల్లనగ్రోవిని చేతిలో వుంచుకునే రంగడు నిద్రపోయేవాడు.

ఊళ్ళోకిమాత్రం రంగడెంతటి నిరాదరణకి పాత్రుడయ్యాడో, వాడి వేణుగానమూ అంత నిర్లక్ష్యానికి పాత్రమయింది. ఒకరి మెరమెచ్చుల కోసం ప్రారంభించిన కృషికాక పోవడంచేత రంగడు అందువల్ల నిరుత్సాహ పడటం సంభవించలేదు. జోలపాటలా వుండవలసిన వేణుగానం రచ్చకు దాపున కాపురమున్న వాళ్ళకి నిద్రాభంగ హేతువుగా పరిణమిస్తోందని తెలిసినప్పుడు కూడా రంగడు ఖేదపడలేదు. తను వాళ్ళకి అయిష్టుడు. తనపట్ల వారికున్న కూరిమి కొద్దిపాటిది. ఆ కూరిమి తను వాళ్ళకి చాకిరీ చేసినంతవరకు మాత్రమే వుండి, తరువాత రంగం పైనుంచి తెర వెనుకకు వెళ్ళిపోయే నాటక పాత్రలా మాయమైపోతుంది. ఆపైన తనుచేసిన ప్రతిపనీ వాళ్లి అవహేళనకీ, అసహ్యతకీ గురౌతుంది. అందుకు చింతించి లాభంలేదు.

లేమిచేత బాధపడుతూ అష్టకష్టాలు ఎదుర్కోవలసిన మనిషికూడా తన జీవితంలో ఎక్కడో ఒకచోట టర్నింగు పాయింటు వుంటుందనీ, ఆ పైన తనకోసం నవజీవనానందం కాచుకుని వుంటుందనీ కలలు కంటాడు. ఆవిశ్వాసంతో బ్రతుకుతాడు. రంగడికలాటి ఆశకూడా లేదు. కాని ఆశ వుద్భవించడానికెంత సేపు కావాలి? ఒక క్షణం చాలు.

ఓ రోజు వుదయం రంగడు కొంచెం ఆలస్యంగా నిద్రలేచి కళ్లు నులుముకుంటూ పాకలోనుంచీ బయటికి వచ్చాడు. అప్పటికి రెండుబారల ప్రొద్దెక్కింది. టముకుపైన కర్రవేసి ధణధణా వాయిస్తూ ఊరంతా చుట్టి యింటికి వెళ్తున్న తోటి లింగమయ్య "విన్నావా రంగయబాబూ! నాటకం వచ్చింది నాటకం! రాయప్ప కంపెనీది" అన్నాడు.

"రానీలేరా! డబ్బు దండుకోడానికేదో వస్తుంటుంది." అన్నాడు రంగడు.

రంగడికైతే నాటకం పట్ల ఆసక్తిలేదు గానీ, ఆ ప్రాంతంలో రాయప్ప కంపెనీ నాటకం పేరు చెబితే కాపులు కూలీలు చద్దికూళ్లు కట్టుకుని, తిరణాళ్లకు బయల్దేరినట్టు తోదులు తోదులుగా కదలి వస్తారు. కానీ ఖర్చులేకుండా ప్రొద్దుపొడిచి రాచిన

కుంపటిలో కుసుమం

గొంతుకతో చోపుదారి మంగళం పాడేటరకూ వడి వీధిలో ఆకాశం క్రింద కూచుని వీధినాటకం చూడ్డానికి అలవాటు పడిన ముసలివాళ్ళు 'నాలుగ్గంటల సంబరానికి నాలుగణాలు తగలేయడమేమన్రా! మా కాలంలో మేమెరగమబ్బా ఈ చోద్దాలు" అని మూతి ముడుచుకునేవారు. కాళ్ళల్లో బలముండి సునాయాసంగా నడవగల కుర్రవాళ్ల ధోరణి వేరు! వెధవనాలుగణాలు! రెండు రోజులు వక్కాకు, బీడీలు మానుకుంటే పోలా! ఆ కంపెనీలో వున్నారే, యిద్దరు అమ్మాయిలు, వాళ్లు వేసే ఒక్క అడుగుకి, పాడే ఒక్క పదానికి యిచ్చేయవచ్చు నాలుగణాలు!

నిజమే మరి! రాయప్ప మేనగోడళ్లు అడుగు చక్కగానే వేస్తారు పాట బాగా సాగదీసి పాడుతారు. ఆ ఆటా, ఆ పాటా, మగాళ్ళకి తెలియకుండా అదీ యిదీ అంగడిలో పోసి అమ్మలక్కలు నింపుకున్న వక్కాకు తిత్తుల్ని ఖాళీ చేస్తాయి. ఇంటి ఖామందుకు తెలియకుండా తమలపాకులమ్ముకుని రొండిలో దోపుకున్న పాలేరు గుప్తనిక్షేపాన్ని హరిస్తాయి.

అటు వీధి నాటకమూ గాక, యిటు డ్రామాను గాక రెండింటి సాంకర్యం చేత సిద్ధించిన విచిత్ర రూపకాలు రాయప్ప కంపెనీవి అవి డిమాలో, వ్యాయోగాలో, ఈహామృగాలో ఆ దశ రూపకకర్తే చెప్పాలి! వాటిని చూచే ప్రేక్షకులు మాత్రం ఏకకంఠంగా ఒకే మాట చెబుతారు. "నాటకమంటే రాయప్ప కంపెనీ నాటకంరా! అబ్బబ్బ! ఏంసీన్లు, ఏం డాన్సులు! బయస్కోపు ఎందుకురా దీని దగ్గర."

మొదటిరాత్రి కృష్ణలీలలు జరిగాయి రంగడు సగం ఆటలో టికెట్టు లేకుండా కంచెదాటి లోపలికి వెళ్ళి ఓ మూల కూచున్నాడు. అప్పుడు బృందావనంలో గోపికాలోలుడి వేణుగాన వినోదం జరుగుతోంది రంగడు కొంతసేపు విని మరి వినలేక చెవులు మూసుకుంటూ "అబ్బాయబ్బాయ్! అది పిల్లనగ్రోవి కాదురా బాబూ! చావు మేళంలా వుంది. ఆపు, ఆపు" అని కేక వేశాడు. హార్మోనియం వెనుక నిలబడి ప్రేక్షకలోకంపైన తన నాటకం ఎలా పనిచేస్తున్నదా అని తొంగి తొంగి చూస్తున్న కంసవేషధారి రాయప్ప ఆ మాటతో మండిపడి "ఎవరది, ఎవరది" అంటూ రంగం పైకి వచ్చాడు. అలాటి సమయాల్లో వెనుకాడే స్వభావంకాదు రంగడిది. వాడు పైకిలేచి "నేనేనయ్యా ఆ మాట అన్నది" అన్నాడు.

రాయప్ప ఆగ్రహోదగ్రుడై పోయాడు. "ఏమయ్యో మీరా సాహెబ్! అయ్యా చంద్రయ్య నాయుడూ!" అంటూ నాటకం కంట్రాక్టుదార్లని పిలిచాడు. వాళ్ళకు టికెట్లు అమ్ముకోడంపైన వున్నంత శ్రద్ధ నాటకం జరగాలా, లేదా అన్న విషయం పైన వుండదు. బుకింగ్ ఆఫీసు మూసుకుని వాళ్లెప్పుడో ఊళ్లోకి వెళ్ళిపోయారు. సభలోనుంచి పదిమంది పెద్దమనుషులు పైకిలేచి "నీకేం తెలుసులే కూచోరా" అంటూ రంగణ్ణి మందలించి, రాయప్పని మళ్ళీ తెరవెనక్కి పొమ్మని ప్రాధేయపడి నాటకం సక్రమంగా జరిగేటట్టు చూచారు.

వరుసగా ఐదురాత్రులు నాటకాలు జరిగాయి. ఆరో రోజు సాయంత్రం రాయప్ప సహచరులు కొందరు వెంటరాగా హార్మోనియం మెడకు తగిలించుకుని ఊళ్లో వసూళ్ళకోసం బయల్దేరాడు. పెద్ద వీధి పూర్తయి సందులోకి తిరిగేసరికి రాత్రి ఎనిమిది గంటలయింది. రాయప్ప వున్నట్టుండి ఒకచోట ఆగిపోయాడు. ఆగి "ఎక్కడిదా పిల్లనగ్రోవి?" అన్నాడు.

పాట వింటూ రాయప్పని వెంబడిస్తున్న కుర్రాడొకడు "అదా! ఆనాడు మీ నాటకానికి ఒంక బెట్టినవాడిది" అన్నాడు.

రాయప్ప వసూళ్ళమూట కట్టిపెట్టి రంగడి పాక దగ్గరికి వెళ్ళి నిలబడ్డాడు. పాకముందు గంగరావిచెట్టు క్రింద కూచున్న రంగడు "ఏంరాయప్పా! వసూళ్ళకోసం వచ్చావా! నేను యిచ్చేవాణ్ణికాదు, పుచ్చుకునేవాణ్ణి" అని పకపకా నవ్వాడు.

"పోనీ, పుచ్చుకుందువుగాని ఒక పాటపాడి వినిపిస్తావా బాబూ" అన్నాడు రాయప్ప.

రంగడు మళ్ళీ పిల్లనగ్రోవి అందుకున్నాడు.

పాట పూర్తయిన తర్వాత రాయప్ప యింటివైపు చూస్తూ "దీపంకూడా వెలిగించకుండా యిక్కడ కూచున్నావేం బాబూ" అన్నాడు.

"దీపం పెట్టేవాళ్లెవరున్నారు రాయప్పా! ఇది దీపం లేనియిల్లు" అన్నాడు రంగడు.

రాయప్ప రంగడి ముఖంకేసి తీక్షణంగా చూచాడు. సన్నగా పొడుగ్గా పరుగెత్తే పాముని తరిమి పట్టుకునే యౌవన బింకంతో మిసమిసలాడుతున్న ఆకారం! పైగా వీడు నీలమేఘశ్యాముడు! తలలో నెమలిపింఛం లేకపోయినా, మెడలో సెంగల్వ పూలదండలేకపోయినా రంగడు ఆలేత వెన్నెల్లో రాయప్ప కళ్ళకు సాక్షాత్తు శ్రీకృష్ణుడిలా కనిపించాడు.

పైకి లేస్తూ రాయప్ప "నీతో ఒకమాట చెప్పాలి బాబూ! ఓసారి నాతో వస్తావా" అన్నాడు.

రంగడు రాయప్పని వెంబడించాడు. ఆ మరునాడు రాయప్ప కంపెనీ ఊళ్ళోనుంచీ వెళ్లిపోయింది. వాళ్ళతోబాటు రంగడూ వెళ్లిపోయాడు.

ఆరునెలలపాటు అంతర్ధానమైవుండి రంగడొకనాడు మళ్ళీ హఠాత్తుగా ఊళ్ళోవాళ్లకి కనపడ్డాడు. వస్తూ, వస్తూ వట్టి చేతులతో యిల్లు చేరుకునే అల

వాటు రంగడికి లేదు. అతడీసారి రాయప్ప మేనకోడళ్లలో చిన్నదాన్ని వెంట తీసుకొచ్చేశాడు.

రంగడావిడని లేవదీసుకొచ్చాడా, లేక ఆవిడే రంగణ్ణి లేవదీసుకొచ్చిందా అన్న చర్చ ఒకవైపు కొనసాగుతుండగానే, మరొకవైపున రంగడి సమవయస్కులు కొందరు తమకు భూమీపుట్రా, యిల్లూ వాకిలీ, డబ్బూ దస్కమూ వున్నా తాము రంగడు చేసినంతమాత్రం పని చేయలేకపోయినందుకు లోలోపల కుతకుతలాడి పోసాగారు. ఆ వ్యథని కప్పిపుచ్చుకోడానికి రంగణ్ణి కించపరచి మాట్లాడ్డంకన్నా వాళ్లకి ఉపాయాంతరం లభ్యంకాలేదు. తన తిండికే వెరవు లేని రంగడు దాన్ని భరించడమేమిటి? ఐనా నాటకాలాడే మనిషి కాపురం చేస్తుందా? ఈ మూన్నాళ్ల ముచ్చటకే యింత మిడిసిపాటా వీడికి!......ఇలా దుష్ప్రచారం కొనసాగిస్తూ వాళ్లు రంగడినుంచి వైదొలగి వుండడంపోయి, వాడి యింటి చుట్టే ప్రదక్షిణం చేయసాగేరు. ఒకరిద్దరు రంగడింట్లో లేకపోడం చూచి రమణమ్మతో సరాగాలు పోవడానికి కూడా సాహసించారు. మరొకడేమో ఒకానొక పుస్తకంలోంచి ప్రేమలేఖని తూచా తప్పకుండా కాపీచేసి దాన్ని రమణమ్మకి చాకలి ఎల్లి ద్వారా బట్వాడా చేయించాడు. "వెధవ రాస్తే రాశాడులే" అని రంగడు దాన్ని చించి పొయిలో వేశాడు. ఈ లోకువ ఆధారంగా వాడు రమణమ్మని ఒంటరిపాటున బలాత్కారం చేయడందాకా కథని సాగదీశాడు. రంగడికి కోపం సాధారణంగా రాదు. వసేమాత్రం వాడు మనిషికాడు. ఆ కోపంతో రంగడు అతణ్ని నడివీధిలో నిలబెట్టి "నీకు అక్కాచెల్లెళ్లు, పెండ్లాం బిడ్డలు లేరా? వాళ్లనెవడైనా యిలా బలాత్కారం చేస్తే ఊరుకోడానికి నువ్వు వుప్పా, కారమూ లేని గడ్డి దింటున్నావా" అని అడిగేశాడు. పదెకరాల సేద్యమూ, పదిమంది ప్రక్కబలమూగల ఆ ఆసామి రంగడి పైకి హుంకరించాడు. అతడితోబాటు, అతడి అనుచరులు రంగణ్ణి చుట్టుముట్టారు.

"ఐతే కథ సశేషంగా మిగిలివుందన్నమాట!" అంటూ లేచాడు నారిగాడి ద్వారా రంగడి కథ సాకల్యంగా విన్న వజ్రపాణి.

"ఇదిక్కడ ఆగిపోదు బాబయ్యా! ఇంకా సాగుతుంది" అన్నాడు నారిగాడు.

వజ్రపాణి అప్పుడే ముట్టించిన సిగరెట్టుని క్రింద పారవేసి గబగబా మేడలోకి వెళ్లి తనగదిలో పట్టెమంచంపైన పడుకున్నాడు. అతడు నిద్రపోవాలన్న సదుద్దేశంతో పడుకున్న మాట నిజమే! కాని నిద్ర రాలేదు. ఎంత ప్రయత్నించినా వీధిలో గాయాలు తగిలి పైకి లేవలేక క్రింద కూలబడి పోతున్న రంగడి స్వరూపం అతడి మనోఫలకం మీదినుంచీ మాసిపోలేదు. గట్టిగా కళ్లు మూసుకున్నాడు. తన వ్యాపారంగురించి ఆలోచించుకోడానికి ప్రయత్నించాడు. మూడోజాము కూడా మెలకువతో వుండగానే గడచిపోయింది. తెల్లవారు జామున మాత్రం ఒక చిన్న కునుకు మగతగా వజ్రపాణిని క్రమ్ముకుంది. ఆ నిద్రలో కల! కలలో రంగడు మళ్ళీ అతనికి కనిపించాడు.

రంగణ్ని తీవ్రంగా మందలింప దలచుకున్నాడు వజ్రపాణి. "ఒరే రంగడూ! ఋజుమార్గంలో నడవక బ్రతుకంతా డొంక తిరుగుళ్ళతోనే గడిపివేయడానికి నిర్ణయించుకునే వాళ్ళలో నువ్వు మొదటివాడివి. లోకంలో అందరూ మహారాజులే వుండరు. పేదవాళ్ళు కూడా వుంటారు. కాని ఆ పేదవాళ్ళు కూడా బ్రతికడానికి ఏదో ఒక జీవనోపాధి చూచుకుంటారు. నువ్వలాటి బ్రతుకు తెరువు చూచుకోలేదు. నువ్వు తింటే తింటావు. లేకుంటే పస్తుంటావు. పని చేస్తే చేస్తావు. లేకుంటే కాళ్లు బారగిల చాపుకుని పడుకుంటావు. అదీఒక జీవితవిధానమే కావచ్చు. కానీ అంత సులభంగా బ్రతకదలచుకునే వాళ్ళకు యితర ఝంఝాటాలేవీ వుండకూడదు. నువ్వెక్కడెక్కడో నాటకాలాడేదాన్ని తెచ్చి యింట్లో వుంచుకున్నావు. తాను దూరడానికే సందు లేకపోతే, మెడకొక డోలేమిటి! నీ పిచ్చి గాకపోతే. ఆవిడ నీకు కాపురము చేస్తుందా? అప్పుడే ఊళ్ళో ఏదో రగడ బయలుదేరింది. ఈ రచ్చకు కారణం ఆవిడేనని నేను చెప్పడం లేదు. ఊరంతా ఆ మాటే అంటోంది. అడుసు త్రొక్కనే రాదు. త్రొక్కేశావు. పోనీ, యిప్పుడైనా కాళ్లు కడుక్కో."

ఇన్ని మాటలూ విని రంగడు వజ్రపాణికి దగ్గరగా వచ్చాడు. వస్తూ మెల్లగా "అన్నయ్యా!" అన్నాడు. వజ్రపాణి వులిక్కిపడి తలపైకెత్తాడు. "నాకు అప్పుడప్పుడూ మంచి మాటలు చెప్పడం నీ కలవాటు. నువ్వు నామీద మోపిన నేరాలన్నీ చాలామట్టుకు నిజమైనవేనని నేను ఒప్పుకుంటున్నాను. నేరస్థుడినిగా నా సంజాయిషీ కూడా నువ్వు దయచేసి వినాలి. మొదటిది: నేనొక బ్రతుకు తెరువు చూచుకోలేదు. ఏపూట కాపూట తిండికోసం వెదుక్కోడమే నా బ్రతుకు తెరువు! నా కొద్దిపాటి చదువు ఏ వుద్యోగానికి పనికొస్తుంది. రెండోది: నేను తిండి తింటాను, లేకుంటే పస్తుంటానన్నావు. నిజమే. దొరికితే తింటాను. లేకుంటే పస్తుంటాను. నేను సోమరివాణ్ణికాను. పనిదొరికితే చేయడానికి నే నెప్పుడూ సిద్ధంగా వుంటాను. పని దొరక్కపోతే కాళ్లు బారగిల చాపి పడుకోక మరేం చేయాలో నాకు తోచదు. అంత సులభంగా బ్రతకదలచుకునే వాళ్లకు యితర ఝంఝాటాలుండకూడదన్నావు. నీకు తెలియదేమోగాని ఇంటింటికీ తిరిగే బిచ్చగాడి

కొకడికి యిద్దరు పెళ్ళాలు, పదిమంది బిడ్డలూ వుండడం నే నెరుగుదును. ఐనా నేను కోరికోరి ఈ ఝంఝాటాన్ని తెచ్చుకోలేను. ఆవిడ నన్ను నమ్ముకుంది. ఉన్నచోట వుండడానికి వీల్లేక యిలా వచ్చేశాం. పోలిక కోసం గాదుగానీ యిక్కడొక విషయం చెప్పాలనిపిస్తోంది. నువ్వు కాలేజీలో చదువుతూ ఒకమ్మాయిని పెళ్ళిచేసుకోవాలనుకున్నావు. పెదనాన్నగా రందుకొప్పుకోలేదు. కానీ నువ్వు పట్టుబట్టి కూచున్నావు. ఆవిడని పెళ్ళిచేసుకున్నావు. నువ్వు వర్ణాంతర వివాహం చేసుకున్నందుకు వెయ్యిమంది నిన్ను పొగిడారు. నన్నలా పొగడవలసిన అవసరం బొత్తిగా లేదు. హేళన చేయకుంటే చాలు. అదీ నాకు పదివేలు! ఇంతకూ నే నావిడని పోషించవలసిన అవసరం కూడా లేదు. ఆవిడా నాతోబాటు ఏపని చేయడానికైనా సిద్ధంగా వుంది. లోకంలో కోట్లకోలది జనం బ్రతుకుతున్నారు. మేమిద్దరం బ్రతకలేకపోము. మా పాటుకు మమ్మల్ని బ్రతకనివ్వడంకన్నా, మాకు యితరులు చేయవలసిన మేలుఏదీ లేదు. నేను అడుసు త్రొక్కనన్నావు. ఎక్కడ త్రొక్కానో నాకు తెలియడం లేదు. నా కాళ్లకి బురదా లేదు. అందుచేత దాన్ని కడుక్కోవాలన్న ప్రసక్తి అసలే లేదు."

తలుపుపైన ఎవరో దబదబ బాదుతుండడం విని వజ్రపాణి మేలుకున్నాడు. సూర్యకిరణాలు కిటికీగుండా పైకివచ్చి పడుతున్నాయి. నారిగాడు తలుపు కావలినుంచీ "బాబూ, మీ కోసం రంగయ్య వచ్చాడు" అన్నాడు.

"ఇప్పుడు నేను పట్నంవెళ్ళాలి. తీరికలేదు వెళ్ళిపొమ్మను" అన్నాడు వజ్రపాణి.

* * *

మూడు నెలలు గడచిపోయిన తర్వాత వజ్రపాణి మళ్ళీ స్వగ్రామానికి తిరిగిరావడం తటస్థించింది. హేమంతం జరుగుతోంది. ప్రతి సంవత్సరమూ మంచుకాలం రాగానే ప్రసన్న పొడిపొడిగా దగ్గడానికి ప్రారంభిస్తుంది ఆ పొడిదగ్గుకు పేరుపెట్టడంలో నైతే డాక్టర్లు ఒక్కొక్కరూ ఒక్కొక్క పోకడపోయినా నయం చేయడంలోమాత్రం అందరూ విఫలులై కడకు శిశిర హేమంతాలు నాలుగునెలలు రోగి కంప్లీటు రెస్టు తీసుకోవాలని సలహాయిచ్చారు. 'రెస్టు' అనేది పది అనేచోట పదిహేనుగా పారేస్తే పట్టణాల్లో లభ్యమయ్యే వస్తువుకాదు. అందుచేత ప్రసన్న పల్లెటూళ్ళోనే వుండిపోవలసి వచ్చింది.

కారులోనుంచీ దిగుతూనే వజ్రపాణి ప్రసన్న ఆరోగ్యాన్నిగురించి పరామర్శించాడు. టిఫిన్ తీసుకుని, తోటలోకివెళ్ళి ఒకసారి నలువైపులా కలయ చూచివచ్చి, అభ్యంగనస్నానం నిర్వర్తించి, భోజనమైంతర్వాత పడుకున్నాడు. తలగడిగిన నాటినిద్ర, గాఢంగా పట్టింది. టంగుటంగున గడియారం మ్రోగడంవిని లేచి టైంచూచాడు. నాలుగైంది. ఎదుట టేబుల్ పైనవున్న ఫ్లాస్కు తీసి కాఫీ గ్లాసులో పోసుకుని త్రాగాడు. పడకపైనుంచి దిగడానికి మనస్కరించడం లేదు. అక్కడేఉన్న న్యూసు పేపరు తీసి పుటలు త్రిప్పుతూ కూచున్నాడు.

హాల్లోనుంచీ అడుగులసవ్వడి వినిపించింది. ప్రసన్న వస్తుందేమోనని వజ్రపాణి తలపైకెత్తాడు. కానీ హాల్లో నడుస్తున్న మనిషి ప్రసన్న కాదు. తెరచిన కిటికీగుండా వజ్రపాణి కళ్లముందు ఒక క్షణం పాటు మెరపుతీగ పారాడినట్లయింది. అతడు మంచం పైనుంచి క్రిందికిదూకి కిటికీదగ్గరికి వెళ్లి నిల్చున్నాడు. ఒక యువతి! తనకి అపరిచిత! అదొక స్త్రీ మూర్తిగాదు శంపాలతలా వుంది. అవును. అది శంపాలతే! మేడమెట్లెక్కి పైకివెళ్తోంది.

ఎవరీవిడ? వాలకంచూస్తే ఈ యింటితో బాగా పరిచయమున్న దానిలా కనిపిస్తోంది. ప్రసన్న రాగానే అడగాలి. భార్యకోసం ఎదురుచూస్తూ మళ్లీ మంచం పైన కూచున్నాడు వజ్రపాణి.

ఐదు గంటలకు సరిగ్గా వాహ్యాళికి సిద్ధమై ప్రసన్న గదిలో అడుగుబెట్టింది. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. ఇద్దరూ మెల్లగా కొబ్బరితోటవరకూ నడిచారు. ఆవిడెవరు ప్రసన్నా: అన్న ప్రశ్న ఆలోగా నాలుగైదుసార్లు వజ్రపాణి గొంతువరకూ వచ్చి అక్కడ వెలక్కాయ పడినట్లు ఆగిపోయింది. ఆవిడ పట్ల తనంత కుతూహలం ప్రకటించడం సమంజసం కాదేమో! ఇలా తటపటాయిస్తుండగా ప్రసన్నే ఆప్రస్తావన తెచ్చింది.

"ఏమండీ! మీ రావిడని చూడలా" అంది ప్రసన్న.

గడసరితనం ఎక్కడికి పోతుంది! "ఎవర్ని ప్రసన్నా?" అన్నాడు వజ్రపాణి.

"మీ మరదల్ని!"

"నా మరదలా!"

"అవునండీ! అలా తెల్లబోతా రెందుకూ? మరదలంటే తెలియదూ! తమ్ముడిభార్య" అంది ప్రసన్న.

"తమ్ముడొకడు! తమ్ముడి కొక భార్యకూడానా! ఇదేమైనా కథా ప్రసన్నా!" ముఖంలో అమాయకత్వం ఒలికిస్తూ ప్రశ్నించాడు వజ్రపాణి.

"కథగాదండీ బాబూ! వాస్తవం. ఆవిడ మీ రంగడి భార్య."

వజ్రపాణి కీసారి కోపం వచ్చింది. "ప్రసన్నా! నువ్వు 'భార్య' అన్నమాటని కలుషితం చేస్తున్నావు.

రంగడు ఆవిడని లేవదీసుకొచ్చేశాడు. ఆవిడ రంగడి కేమైనా కావచ్చు. కాని భార్యమాత్రం కాదు."

ఈ తర్కం ప్రసన్నకి అర్థంకాలేదు. "లేవదీసుకొచ్చినమాట నిజమేనండీ! ఐతే ఎక్కడో దేవుడి ముందర అతడు ఆవిడచేతిలో చేయివేసి 'యికమీదట నేను మొగుణ్ణి, నువ్వు పెళ్ళానివి' అన్నట్ట అప్పటి నుంచీ వాళ్ళిద్దరూ భార్యాభర్తలుగా వ్యవహరిస్తున్నారు."

"బాగుంది, బాగుంది. అంటే తాత్కాలికంగా నన్నమాట!" అంటూ వికావికా నవ్వేశాడు వజ్రపాణి.

"పోనీ ఆవిడ మనయింట్లో ఎందుకుంది అని అడగరేమండీ" అంది ప్రసన్న.

"ఆవిడ మనయింట్లో వుందా! ఐతే యిదొక అద్భుత కథానకమే ప్రసన్నా! నేను ఆవిడ ఏదో పనిమీద మన యింటికి వచ్చిందనుకున్నాను."

"లేదు మన యింట్లో నేవుంది"

"ఎందుకూ?"

"రంగడిప్పుడు ఊళ్ళో లేడుగా!"

"ఏమయ్యాడు?"

"రెండేళ్లు పడింది."

"ఏమిటి?"

"శిక్ష!"

"అబ్బ కాస్తవివరంగా చెప్పకూడదా ప్రసన్నా! నాకు ఆద్యంతాలే తెలియడంలేదు" ప్రాధేయపడ్డాడు వజ్రపాణి.

"మీరు పట్నానికి వెళ్ళి పదిరోజులు కూడా కాలేదు. ఊళ్ళో మళ్ళీ రగడజరిగింది. రంగడు ఒకడి తల చితగ్గొట్టేశాడు."

"ప్రాణాపాయం లేదుగదా!"

"చావు దప్పి కన్నులొట్టబోయింది. పోలీసు లొచ్చారు. రంగణ్ణి అరెస్టుచేసి తీసుకెళ్ళారు."

"తత్ఫలితంగా శిక్షపడింది. అంతేకదూ ప్రసన్నా! నే నప్పుడే అనుకున్నాను. అనుకున్నంతా జరిగింది. ఈ విడని నడివీధులపాల్జేసి వాడు కమ్ముల్లోపల కూచున్నాడు."

"పాపం, రమణమ్మని చూస్తుంటే జాలిగా వుందండీ."

"ఉండదూమరి! నాపట్టివిగా, పాలు బువ్వ పెడతా రామ్మా అని బుజ్జగించలేక పోయావా ప్రసన్నా!"

"మీకంతా ఎగతాళిగానే వుంటుంది. ఈ రెండేళ్ళూ ఆవిడని నాదగ్గరే వుండిపొమ్మన్నాను"

"వాక్యం పూర్తిచేయకు. సుభద్రదగ్గర సైరంధ్రిలా అని వుపమానం కలిపితే వాక్యం సర్వాంగసుందరంగా వుంటుంది."

"ఆవిడ లేకపోతే నాకీ వూళ్ళో ప్రొద్దేపోయేది కాదేమోనండీ! ఏం చక్కగా పాడుతుందనీ!"

"గగనవీధిని దేలు ఓ మేఘమాలా! జైలుగోడల పైన మసలి వస్తున్నావా! అని పాటని సవరించుకోడం లెస్స. ఐనా మొగుడు జైల్లోవుండగా ఇక్కడ ఈవిడ పాటలు పాడుకుంటూ కూచోవడానికి యిదేమైనా సినిమానా ప్రసన్నా!"

"అబ్బే, నా బలవంతం పైన పాడుతోందండీ! మనిషిని చూచారు గదా! మీ కళ్ళకి ఎలా కనిపించిందో మరి!"

"అచ్చం సెట్ పైకి వెళ్తున్న తారలా కనిపించింది"

ఇద్దరూ కొంత సేపు మౌనంగా కూచున్నారు. మళ్ళీ ప్రసన్నే వుపక్రమించింది.

"ఏమండీ! ఒక మాటంటాను"

"ఏమంటావు?"

"మనకు చేతనైనప్పుడు యితరులకు మేలు చేయడంలో తప్పులేదు గదూ!"

"తప్పేముంది! పరోపకారార్థ మిదం శరీరం గదా ప్రసన్నా!"

"ఐతే నేను చెప్పినట్లు చేస్తారు కదూ!"

"మరీ హిరణ్యాక్షవరం కాకపోతే సరి!"

"రమణమ్మని సినిమాలో చేర్పిస్తే?"

ఆ ఊహ వజ్రపాణిలో సైతం మెదుల్తోంది. కాని అతడు భార్యమాట కొట్టివేయ బోయాడు. "పాట బాగా పాడడ మొకటే చాలదు ప్రసన్నా వెండి తెరకి! మరికొన్ని అర్హతలుండాలి"

"ఆమెకి నటన కూడా క్రొత్త గాదుగా!"

వజ్రపాణి సీరియస్‌గా ఆలోచిస్తూ కూచున్నాడు. ఆలోచించిన కొద్దీ అతడి భావప్రవంతి రెండుపాయలుగా చీలిపోసాగింది. ఒక వైపు రమణమ్మ దుస్థితికి జాలిపడుతూ, మరొకవైపున అతడు ఆవిడ నీస్థితికి తెచ్చిన రంగడి పైన లోలోపల మండిపడ్డాడు. నేడావిడ నిలువనీడ, పట్టుకొమ్మలేని నిరాశ్రయ! నా అన్నవారినుంచి వేరుచేసి వీడామెతల కెత్తిన సిరియిది! వీడెప్పటికైనా చెడిపోవలసిన వాడే! తనతో బాటూ ఈడీమెను కూడా అధోగతి వైపు లాక్కెళ్ళ జూస్తున్నాడు. అలా జరుగుతుంటే చూస్తూ వూరుకోడానికి తన మనసొప్పదు. వారి బారి నుండి ఈమెని కాపాడాలి. అందుకు ప్రసన్న సూచిస్తున్న విధానం సముంజసంగానే కనబడుతోంది!

[సశేషము]